క్లుప్తంగా

మంచి పుస్తకాలు చదవడం ఉత్తమం



నరసాపురపుపేటలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న వరల్డ్ సూసైడ్ ప్రివెన్షన్ డేను పురస్కరించుకుని వన్ స్టెప్ టు సేవ్ లైఫ్ అనే కార్యక్రమం ద్వారా ఆత్మహత్యల నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఫౌండేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్, కన్సల్టింగ్ మోటివేటర్ ఎంకేపీ వాణి మాట్లాడుతూ జీవితం చాలా విలువైందని, సమస్య వచ్చినప్పుడు వాటిని అధిగమించాలే తప్ప ఆత్మహత్యలకు పాల్పడ రాదని వివరించారు. కౌమార దశలో వచ్చే ఒడిదొడుకులను తట్టుకోవాలంటే మంచి పుస్తకాలు చదవడం, మంచి వారితో స్నేహం చేయడం ఎంతో ఉత్తమమన్నారు. పాఠశాల హెచ్ఎం కేకేఎల్ కుమారి, ఎస్ఎంసీ వైస్ చైర్మన్ పి.శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు వారణాసి సత్తిబాబు, మేకా నారాయణరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు చల్లా శోభావళి, మైత్రీ సేవా సంఘం సభ్యుడు గోపి పాల్గొన్నారు.

వినాయక మంటపంలో సరస్వతీ పూజ



వరసిద్ధి వినాయక మంటపం వద్ద సరస్వతీ పూజ చేస్తున్న మహిళలు

మండపేట: గణపతి నవరాత్ర మహోత్సవాల సందర్భంగా స్థానిక సైథిల్‌పేట వీధిలోని వరసిద్ధి వినాయక మంటపం వద్ద బుధవారం పలురకాల పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సైథిల్‌పేట ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో సరస్వతీ పూజ, దీపాలంకరణతో పాటు సాయిబాబా భజన చేశారు. మహిళలు, చిన్నారులు గణేశుడి సేవ చేశారు. తమకు చక్కటి విద్యాబుద్ధులు సిద్ధింప జేయాలని కోరుతూ విద్యార్థులు సరస్వతీ పూజ చేశారు. అలాగే సహస్ర నామార్చన చేశారు. దీపాలంకరణలో భాగంగా వినాయకునికి ఉయ్యాల సేవ నిర్వహించారు. ఇక్కడి మంటపం ఎదురుగా రోడ్డుపై పూలతో వేసిన దేవుళ్ల చిత్రాలు ఆకట్టుకున్నాయి. వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, శివలింగం, శంఖు చక్రాలతో పాటు ఓంకారం వంటి రూపాలను చామంతి, చిట్టి రోజాలు, బంతి, తెల్ల చామంతి పూలతో అందంగా తీర్చిదిద్దారు.

పోషకాహారంతో ఆరోగ్యకర సమాజం



తాతపూడిలో మాట్లాడుతున్న సీడీపీఓ గజలక్ష్మి

కపిలేశ్వరపురం: ఆరోగ్యకర సమాజానికి పోషకాహారం దోహదం చేస్తుందని ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్ట్ అధికారి అధికారి గజలక్ష్మి అన్నారు. మండలంలోని తాతపూడి గ్రామంలో బుధవారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. 'ఎర్లీ చైల్డ్‌హుడ్, కేర్ ఎడ్యుకేషన్ డే' పేరుతో ఆయా గ్రామాల్లో పోషకాహారం తీసుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఆహారమే పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహద పడుతుందన్నారు. 10 మంది గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ గుత్తుల సత్యనారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొప్పిశెట్టి శ్రీనివాస్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, వైద్య ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో కాలుష్య నివారణ



కుయ్యేరులో మొక్క నాటుతున్న సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి తదితరులు

కాజులూరు: పర్యావరణ పరిరక్షణతోనే కాలుష్య నివారణ సాధ్యమవుతుందని కుయ్యేరు గ్రామ సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి అన్నారు. గ్రామంలోని పలు ప్రభుత్వ స్థలాల్లో బుధవారం ఉపాధి హామీ పథకం సిబ్బందితో కలసి పంచాయతీ సిబ్బంది మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విరివిరిగా మొక్కలు నాటడం ద్వారా గాలిలో కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద మొక్కలు పెంచాలన్నారు. పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురం మండలం వానపల్లి కాజ్‌వే వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద



కేదారిలంక గ్రామ శివారుకు చేరుకున్న వరదను పరిశీలిస్తున్న కపిలేశ్వరపురం తహసీల్దార్ తదితరులు



కేదారిలంక వైద్య శిబిరంలో మందులు ఇస్తున్న నర్సు

వణికిస్తున్న వరద

- ఆందోళన చెందుతున్న నదీ పరివాహక ప్రజలు
- కోటిపల్లిలో మత్స్యకార కాలనీకి వరద ముప్పు
- కేదారిలంక, వానపల్లి కాజ్‌వేలను తాకిన నీరు
- లంక గ్రామాల్లో భయాందోళన
- వరుస వరదలతో సతమతం



కోటిపల్లి రేవు వద్ద పుష్కర మెట్లు దాటి వచ్చిన వరద గోదావరి

కె.గంగవరం: ఏటా గోదావరి వరదలు నదీ పరివాహక ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద భారీగా నీరు చేరుతుంది. దీనివల్ల ఈ నెలలో రెండో సారి కోటిపల్లి వద్ద వరద పెరుగుతోంది. మండలంలోని కూళ్ల నుంచి బ్రహ్మపురి వరకూ వరద గోదావరి పరవళ్లు తొక్కుతోంది. సముద్రంలోకి ఉరకలు వేస్తూ పరుగులు తీస్తోంది. బుధవారం ఉదయం నుంచి గంట గంటకూ గోదావరి పెరుగుతూనే ఉంది. మరింత పెరిగితే కోటిపల్లిలో మత్స్యకార కాలనీ మొత్తం నీట మునుగుతుందని అక్కడి వారు ఆవేదన చెందుతున్నారు.

నిలిచిన పంటు ప్రయాణం

గోదావరి వరదనీరు భారీగా వచ్చి చేరడంతో కోటిపల్లి- ముక్తేశ్వరం రేవులో పంటు ప్రయాణాన్ని రెవెన్యూ అధికారులు గత నెల రోజులుగా నిలిపివేశారు. రేవు దాటిన తరువాత ముక్తేశ్వరం వద్ద ఏర్పాటు చేసిన కంకర రోడ్డు గోదావరిలో కొట్టుకుపోయింది. దీంతో పాటు ఎన్నడూ లేని విధంగా రెండు తూరలు కూడా వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో పంటు ప్రయాణానికి ఆటంకం కలిగింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో గోదావరికి వరద నీరు భారీగా వచ్చి చేరుతుందని, గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సూర్యారావు, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని సుందరపల్లి, కూళ్ల గ్రామాలతో పాటు గోదావరి కోతకు గురవుతున్న ప్రాంతాల్లో బుధవారం వారు పర్యటించారు. మరో రెండు మూడు రోజుల్లో గోదావరి ఉధృతి పెరిగే అవకాశం ఉందని, ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమతి లేకుండా గోదావరిలోకి బోట్లు, నాటు పడవలపై వెళ్లరాదని అన్నారు. అధికారులను కూడా అప్రమత్తంగా చేశామని, గట్లు బలహీనంగా ఉన్నచోట్ల తగిన చర్యలు తీసుకుంటామని వారు చెప్పారు.



సుందరపల్లి వద్ద బలహీనంగా ఉన్న ఏటిగట్టును పరిశీలిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

చుట్టుముడుతున్న వరద

కపిలేశ్వరపురం: వరుస వరదలు లంక గ్రామాల ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. మండలంలోని అద్దంకివారిలంక, కేదారిలంక, పల్లపులంక, నారాయణలంక, వీధివారిలంక గ్రామాల శివారు ప్రాంతాలను బుధవారం వరద నీరు తాకింది. దాంతో కేదారిలంక, అద్దంకివారిలంక గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు అప్రమత్తం అయ్యారు. సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, తహసీల్దార్ చిన్నారావు, వీఆర్వో స్వామినాయుడు కేదారిలంకలోని వరదను పరిశీలించారు. గ్రామ పుష్కర రేవు, వ్యవసాయ క్షేత్రం, ఇటుక బట్టీలను వరదనీరు తాకడంతో గ్రామ అధికారులను అప్రమత్తం చేశారు. అద్దంకివారిలంక, పల్లపులంక తదితర గ్రామాల్లోని పరిస్థితులను సర్పంచ్ నాతి గవరయ్య, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, గ్రామ అధికారులు పర్యవేక్షించారు. వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఉచితంగా మందులు అందజేశారు. రాత్రి సమయంలో సచివాలయ ఉద్యోగులకు వరద విధులను కేటాయించారు. వరద మరింత పెరిగితే ఉన్నతాధికారులు ఆదేశాలపై తగు చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

చిటుకును దూరం చేద్దామా!

- అప్రమత్తతతో వ్యాధి నివారణ
- నిర్లక్ష్యం చేస్తే మృత్యువాత
- గొర్రెలు, మేకల పెంపకందార్లు జాగ్రత్త వహించాలి



గొర్రెలు, మేకల మంద

రామచంద్రపురం రూరల్: చిటుకు వ్యాధిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మూగ జీవాలు మృత్యువాత పడే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు ఈ వ్యాధి వ్యాపిస్తుంది. సీజనల్ వ్యాధులు, మూగ జీవాల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రామచంద్రపురం పశు వైద్యాధికారి మేడిశెట్టి కృష్ణార్జున వివరించారు. వర్షాకాలంలో అతిగా పచ్చగడ్డి లేదా ఎండుగడ్డి తినడం వల్ల పేగుల్లో కదలికలు లేక ఈ వ్యాధి వస్తుంది. వ్యాధి సోకిన కొద్ది సమయంలోనే తీవ్ర రూపం దాల్చి మేకలు, గొర్రెలు మరణిస్తాయి. దీంతో ఈ వ్యాధిని చిటుకు వ్యాధి లేదా తినే వ్యాధి, మూర్ఛ రోగంగా పిలుస్తుంటారు.

లక్షణాలు..

మందలో బలిష్టంగా ఉన్న మేకలు, గొర్రెలు అకస్మాత్తుగా మరణిస్తాయి. చనిపోయే ముందు నీరసంగా ఉండి తూలుతూ, కనుగుడ్లు తిప్పడం, పళ్లు కొరకడం, గాలిలోనికి ఎగిరిపడటం వంటి లక్షణాలతో చనిపోతాయి. ఈ లక్షణాలు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో ఎక్కువగా కనిపిస్తాయి. సూక్ష్మజీవులు విడుదల చేసిన విష పదార్థాలు మెదడుపై ప్రభావం చూపడంతో జీవాలు వెంటనే చనిపోతాయి.

చికిత్స ఇలా..

గొర్రెలు, మేకలన్నింటికీ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. వ్యాధి తీవ్రమైతే చికిత్సకు నయం కాదు. తీవ్రత తక్కువగా ఉన్నప్పుడు గొర్రె లేదా మేక పిల్లలకు 5 మి.లీ టాక్సిన్‌ను చర్మం కింద పొరల్లో ఇవ్వాలి. తద్వారా వ్యాధి తీవ్రతను మరింత తగ్గించవచ్చు.

గొర్రె బరువును బట్టి పెన్సిలిన్ లేదా యాంటీబయోటిక్ మందు ఇవ్వాలి. వీలైతే యాంటాసిడ్ లేదా యాంటీబ్లోట్ మందులు తాగించాలి. థయమిన్(బి1) ఉండే విటమిన్ ఇంజెక్షన్ కండకు ఇవ్వాలి. విష పదార్థ ప్రభావం తగ్గించేందుకు సెలైన్‌లు, కార్టికొస్టిరాయిడ్‌లను ఇవ్వాల్సి ఉంటుంది.

నియోజకవర్గంలో గొర్రెలు, మేకల వివరాలు

మండలం	గొర్రెలు	మేకలు
రామచంద్రపురం	1380	470
కె.గంగవరం	3500	550
కాజులూరు	2200	800
మండపేట	2080	1706
రాయవరం	22	124
కపిలేశ్వరపురం	1349	1121

రేషన్ బియ్యం స్వాధీనం



ద్రాక్షారామలో బియ్యం తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో సుమారు రూ.1.39 లక్షల విలువైన 3023 కిలోల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. ఇన్‌చార్జి ఎంఎస్ఓ సుబ్బరాజు బుధవారం విలేకరులకు తెలిపిన సమాచారం మేరకు.. రాజమహేంద్రవరం విజిలెన్స్ సీఐ సి.నాగవెంకటరాజు తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ద్రాక్షారామలో మాటువేశారు. కె.గంగవరం మండలం సత్యవాడ నుంచి గొల్లపాలెంలో చేపల చెరువులకు వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకుని ద్రాక్షారామ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ బియ్యం తరలిస్తున్న యజమాని సలాది సత్యనారాయణ (సత్తిబాబు), వ్యాను డ్రైవర్ చిలకల సాయికృష్ణలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. పట్టుబడిన బియ్యాన్ని వేములపల్లి సివిల్ సప్లయిస్ గోదాముకు తరలించారు. బియ్యం తరలిస్తున్న వ్యాన్‌ను ద్రాక్షారామ పోలీసులు సీజ్ చేశారు. విజిలెన్స్ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ జీవానందం, కానిస్టేబుల్ లోవరాజు, ద్రాక్షారామ వీఆర్వో కాకినాడ సాయిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ సోదర దినోత్సవం



వివేకానందుని విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఏజీపీ పిల్లి మురళీమోహన్, నాయకులు

రామచంద్రపురం: స్థానిక శివాలయం పార్క్ సమీపంలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహం వద్ద ప్రపంచ సోదర దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ పిల్లి మురళీమోహన్ వెంకటరమణ ముఖ్య అతిథిగా విచ్చేసి వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1893 సెప్టెంబర్ 11న అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రపంచ సర్వమత సమ్మేళనానికి భారతదేశ ప్రతినిధిగా హాజరైన స్వామి వివేకానంద ఆ సభలో మొదటి సారిగా సోదర సోదరీమణులారా అని సంబోధించి ప్రపంచ దేశాలకు భారతదేశ ఉనికిని చాటి చెప్పిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రపంచ సోదర దినోత్సవం జరుపుకొంటున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయన బాటలో నడిచి తోటివారిలో సోదర, సోదరీమణులను చూస్తూ ప్రపంచ శాంతికి పాటుపడాలని సూచించారు. నాయకులు కడలి రాంపండు, కొట్టువాడ హరిబాబు, నాయుడు, కడలి ప్రసాద్, కొరువవాడ కొండబాబు, శేషుకుమార్, వికాస్ కళాశాల అధ్యాపకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు

మండపేట: పట్టణంలోని పెద్ద కాలువ వంతెన వద్ద నెలకొల్పిన జ్యోతీరావు పూలే విగ్రహం పక్కనే ఆయన సతీమణి సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ తెలిపారు. కొత్తపేటకు చెందిన ప్రముఖ శిల్పి రాజ్‌కుమార్ వడయార్‌ను బుధవారం కలుసుకుని ఈ మేరకు పనులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ కోన సత్యనారాయణ, పట్టణ బీసీ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు మల్లువలస గణపతి, గౌరవాధ్యక్షుడు పెంకే గంగాధర్, బీసీ సంఘం నాయకుడు పితాపురం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి ఫాగింగ్ యంత్రం వితరణ



పంచాయతీ సర్పంచ్ రామకృష్ణకు ఫాగింగ్ యంత్రాన్ని అందజేస్తున్న ఫణికృష్ణారెడ్డి

రాయవరం: రాయవరం పంచాయతీలో దోమల నివారణకు వినియోగించే ఫాగింగ్ యంత్రాన్ని ఆ గ్రామానికి చెందిన యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి మంగళవారం అందజేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఫణికృష్ణారెడ్డి ఫాగింగ్ యంత్రాన్ని సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణకు అందజేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రూ.10 వేల విలువైన ఫాగింగ్ యంత్రాన్ని ఉచితంగా అందజేసినట్లు ఫణికృష్ణారెడ్డి తెలిపారు. రాత్రి వేళ ఫాగింగ్ యంత్రంతో దోమల మందుతో కూడిన పొగను స్ప్రే చేశారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యుడు వుండవిల్లి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి ఎస్.దసలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నరసాపురపుపేటలో సీమంతాలు



నరసాపురపుపేటలో సీమంతాలు చేసిన ప్రజాప్రతినిధులు, ఐసీడీఎస్ అధికారులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని నరసాపురపుపేటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి మాట్లాడుతూ ప్రతి గర్భిణి, బాలింత పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని వివరించారు. అనంతరం సర్పంచ్ చాట్రాది వీరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు పడమటి జ్ఞానలక్ష్మిల చేతుల మీదుగా గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కేవీ శ్రీనివాస్, అంగన్‌వాడీ కార్యకర్తలు వి.లక్ష్మీరత్నం, సీహెచ్ దుర్గ, పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కాజులూరు: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కాకినాడ ఏపీ ఈపీడీసీఎల్ డీఈ ఎన్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం మెయిన్ సబ్ స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతులు, విద్యుత్ లైన్లపై ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కాజులూరు సబ్ స్టేషన్ పరిధి కాజులూరు, తిప్పరాజుపాలెం, అయితపూడి, శీల, శీలలంక, ఒంటితాడి విద్యుత్ లైన్లలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. గృహావసర వినియోగదారులతో పాటు, ఆక్వా, ఇండస్ట్రీయల్ ఫీడర్ వినియోగదారులకు సరఫరా నిలిపివేస్తారన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

కాజులూరు: సాగులో మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. బుధవారం శీలలో ఆయన రైతులతో మాట్లాడుతూ అవసరాన్ని మించి ఎరువులు, పురుగు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సేంద్రియ ఎరువులు, వేప కషాయం వంటివి వినియోగిస్తూ నాణ్యమైన దిగుబడులు సాధించాలన్నారు. పురుగు మందుల అవశేషాలు లేని నాణ్యమైన ఉత్పత్తులను రైతు ఉత్పత్తి సంస్థ (ఎఫ్‌పీఓ)ల ద్వారా రైతులు అధిక ధరలకు విక్రయించుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న రైతులు వ్యవసాయ శాఖ వద్ద నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం పురుగు మందుల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా నిరసన



జువ్విపాడులో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న నాయకులు

రామచంద్రపురం రూరల్: బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి ఇచ్చిన భారత్ బంద్ పిలుపు మేరకు మండలంలోని ఓడూరు శివారు జువ్విపాడులో మాల సామాజికవర్గ నాయకులు ఫ్లెక్సీతో నిరసన తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ధర్నాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇసుకపాటి అప్పారావు, మాజీ ఎంపీపీ వినకోటి శ్రీనివాస్, నాయకులు పూసల జయప్రకాశ్, వడ్డి రవికుమార్, గొట్టాల నరేష్, అంబటి శ్రీనివాస్, మద్దెల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎలుకల నివారణ మందు పంపిణీ

కపిలేశ్వరపురం: మండలంలోని 16,057 ఎకరాల వరి పైరుల ఎలుకల నివారణకు బ్రోమోడయాలిన్ మందును గురువారం పంపిణీ చేస్తున్నట్టు ఏఓ కేవీఎస్ రమేష్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వరి పొలాల్లోని నిర్దేశిత ప్రాంతాల్లో ఈ మందును అమర్చడం ద్వారా ఎలుకల బెడదను నివారించగలుగుతారన్నారు. మండలంలోని 17 రైతు సేవా కేంద్రాల వద్ద 71 కేజీల మందును రైతులకు అందజేస్తామన్నారు. ఎకరానికి 192 గ్రాముల నూకలు, 4 గ్రాముల నువ్వులనూనె, 4 గ్రాముల బ్రోమోడయలన్ మందు మిశ్రమాన్ని తయారు చేసుకునే విధానం గురించి పంపిణీ సమయంలో రైతులకు వివరిస్తామన్నారు.

రాయవరం మండలంలో..

రాయవరం: సామూహిక ఎలుకల నివారణలో భాగంగా మండలంలోని 19 రైతు సేవా కేంద్రాల పరిధిలోనూ గురువారం రైతులకు బ్రోమోడయలిన్ మందు పంపిణీ చేస్తామని ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో బ్రోమోడయలిన్ మందును వరి నూకలతో కలిపి రైతులకు అందజేస్తామని వివరించారు.

సీఎం సహాయ నిధికి కౌన్సిలర్ల గౌరవ వేతనం



ఎమ్మెల్యే వేగుళ్లకు గౌరవ వేతనం చెక్కు అందిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు

మండపేట: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి మండపేట మున్సిపల్ టీడీపీ కౌన్సిలర్లు తమ ఒక నెల గౌరవ వేతనాన్ని విరాళంగా అందించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును వారంతా కలసి రూ.30 వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, వి.సాయికుమార్ బాబు, కౌన్సిలర్లు చిట్టూరి సతీష్, శిరంగు జ్యోతి, గుండు రామతులసి, చింతలపూడి దుర్గ, కాళ్లకూరి స్వరాజ్యభవాని, చుండ్రు సుబ్బారావు చౌదరి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.